కూటమి ప్రభుత్వంలో అరాచక పాలన

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ఆదిమూలపు సురేష్


బాబు షూరిటీ మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

జరుగుమల్లి (సింగరాయకొండ): కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో అరాచక, అవినీతి పాలన సాగుతోందని మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. జరుగుమల్లిలో శనివారం రాత్రి పార్టీ అధ్యక్షుడు పిన్నిక శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం, బాబు షూరిటీ –మోసం గ్యారంటీ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ మాట్లాడుతూ కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం అటకెక్కాయన్నారు. మండలంలోని చతుకుపాడు, జరుగుమల్లి, కె.బిట్రగుంట గ్రామాల్లో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోందని ధ్వజమెత్తారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదన్నారు. రెవెన్యూ, పోలీస్, ఇతర వ్యవస్థలు నాయకులకు దాసోహం అయ్యాయని విమర్శించారు. అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే నాయకులు, కార్యకర్తలపై వ్యక్తిగత దాడులు చేయడంతో పాటు అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో గ్రామ వలంటీలర్లకు జీతాలు పెంచుతాం అని నమ్మించి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వ్యవస్థనే రద్దు చేశారని, లేని శాఖకు మంత్రిగా స్వామి ఉండటం మన దౌర్భాగ్యమన్నారు. పొగాకు, మిర్చి, మామిడి రైతులకు జగనన్న అండగా నిలిస్తే నాయకులపై అక్రమ కేసులు బనాయించారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి అటకెక్కిందని, సంపద సృష్టిస్తామని చెబుతున్నారని, కానీ ఎవరికి సంపద సృష్టిస్తారో అర్థం కావడం లేదన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయమంటే అప్పుల్లో ఉన్నామని చెబుతున్నారని, కానీ వేల కోట్లతో అమరావతిలో ఎలా ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో అలివిమాలిన హామీలిచ్చి..ఇప్పుడు ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. పార్టీలో అందరికీ తగిన గుర్తింపు ఉంటుందని, రొటేషన్ పద్ధతిలో పదవులు వస్తాయన్నారు. ఈ నెల 24 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు ఇంటింటికీ బాబు మోసాలను ప్రచారం చేయాలన్నారు. పార్టీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం బాబు షూరిటీ..మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. నాయకులు కనపర్తి శేషారెడ్డి, బత్తిన మనోహర్, మారం రెడ్డి గంగాధర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, దగ్గుబాటి వెంకట నర్సారెడ్డి, దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సులభ పద్ధతిలో బోధించాలి

హనుమంతునిపాడు: నూతన విద్యా విధానంలో విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధించాలని ఎంఈఓ జి.పెద్దిరాజు అన్నారు. హనుమంతునిపాడు, మహమ్మదాపురం, సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కాంప్లెక్స్ తరగతులు నిర్వహించారు. ఎంఈఓ– 2 ఎస్ రమణయ్య, కాంప్లెక్స్ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

342 బేళ్లు తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 342 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని నేతివారిపాలెం, రామాచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు 1257 బేళ్లను వేలానికి తీసుకురాగా 905 బేళ్లనుకొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.215.45గా నమోదైంది. వేలంలో 24 కంపెనీలు పాల్గొన్నాయి.

చెత్త తరలింపు ట్రాక్టర్ల అడ్డగింత


చెత్త ట్రాక్టర్ ముందు బైఠాయించిన నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

- కార్మికుల సమ్మెతో పట్టణంలో దుర్గంధం
- ప్రత్యామ్నాయంగా చెత్తను తరలిస్తుండగా అడ్డుకున్న కార్మికులు
- రోడ్డుపై బైఠాయించి నిరసన

కనిగిరిరూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారంతో నాల్గో రోజుకు చేరింది. పారిశుధ్య కార్మికుల సమ్మెతో ఎక్కడి చెత్త అక్కడి నిలిచిపోగా.. కాలువల్లో నీరు పారుదల కాక మురికి నీరు రోడ్లపైకి తేలుతూ దుర్గంధం వెదజల్లుతూ.. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. చెత్త పాయింట్లలో, ప్రధాన రోడ్ల కూడళ్లలో.. డంపింగ్ పాయింట్ల వద్ద చెత్త రోడ్ల పైకి చేరి నడిచే పరిస్థితి లేకపోలేదు. దీంతో పారిశుధ్య అధ్వాన్నంతో పట్టణ ప్రజలు అల్లాడుతున్నారు.

సమ్మె విచ్ఛినం చేయాలని చేస్తే సహించం

సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తే సహించేది లేదని సీఐటీయూ జిల్లా నాయకుడు పీసీ కేశవరావు అన్నారు. శనివారం మున్సిపల్ కార్మికులకు పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. కార్మికులు సమ్మెలో ఉన్నా.. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇతరులతో చెత్తను ట్రాక్టర్‌లో తరలింపు చేయడాన్ని మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. ఒంగోలు బస్టాండ్‌లోని రోడ్డుపై ట్రాక్టర్‌కు అడ్డంగా బైఠాయించి నిరసన తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గుతుండటంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. దీంతో కొద్ది సేపు వాగ్వాదం జరిగింది. చెత్త ట్రాక్టర్‌ను మున్సిపల్ కార్యాలయంలో పెట్టించడంతో సమస్య సర్దుమణిగింది. కార్మికుల సమస్యలపై తాము ప్రశాంతంగా సమ్మె చేస్తుంటే అధికారులు దాన్ని విచ్ఛినం చేసేలా ప్రయత్నించడం సరైంది కాదన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టడం తమ అభిమతం కాదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఏడాది కాలంగా ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని తీవ్రంగా విమర్శించారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలు నిర్మించాలి


హనుమంతునిపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

పొన్నలూరు: ప్లాస్టిక్ రహిత గ్రామాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ డాక్టర్ సుజాత అన్నారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో మండలంలోని బోగనంపాడులో శనివారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు వాడకుండా బట్ట సంచులను వినియోగించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లను వాడటం వల్ల క్యాన్సర్ వంటి అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. ఈఓఆర్డీ నాగేశ్వరరావు, ఏఓ రాము, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొండపి: ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ నిషేధించాలని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. మండలంలోని కె. ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ–2 రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూసన్నకుమార్, విద్యా కమిటీ చైర్మన్ రాఘవేంద్ర శర్మ, పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పామూరు: పర్యావరణ పరిరక్షణకు సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని తహసీల్దార్ రామచంద్రుని వాసుదేవరాజు, ఎంపీడీఓ ఎల్. బ్రహ్మయ్య, ఎంఈఓ కోటిరెడ్డి అన్నారు. పామూరులో పంచాయతీ కార్యదర్శి జి.అరవిందారెడ్డి, ఎన్‌జీఓ నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సింగిల్‌విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, ఏపీఎం విద్యాసాగర్, ఏఎస్ఐ జిలానీబాషా, హౌసింగ్‌ఏఈ రాజగోపాల్‌రెడ్డి, కే.వి.రమణయ్య, పందిటి హరీష్, షేక్.రహీముల్లా, గుత్తి కొండలరావు పలువురు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. తొలుత ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు, ఈఓఆర్డీ చాంద్‌బాషా, కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ వితరణ


జమ్ములపాలెం పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ బహూకరిస్తున్న దాతలు

టంగుటూరు:: దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని మండల విద్యాధికారి 2 తన్నీరు బాలాజీ అన్నారు. మండలంలోని జమ్ములపాలెం ప్రాథమిక పాఠశాలకు శనివారం మక్కెన వెంకట్రావు ఎంఈఓ చేతుల మీదగా పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ బహూకరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిదన్నారు. ఇన్‌చార్జి ప్రధానోపధ్యాయుడు కొమ్మినేని శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి, జ్యోతి రమాదేవి, ఎస్ఎంసీ చైర్మన్ యమున పాల్గొన్నారు ఎస్ఎంసీ చైర్మన్ యమున, రామారావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ ప్లస్ కళాశాల ప్రాంగణంలో సరస్వతి విగ్రహానికి శనివారం కదిరి విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ కదిరి పార్థసారది భూమిపూజ చేశారు. స్కూల్ చైర్మన్ మూరం మస్తాన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బోడా ప్రసాద్, మాజీ ఎంపీటీసీ మూరం కాశిరెడ్డి, ఉపసర్పంచ్ టి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల పరిశీలన


తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి విష్ణు ప్రియ

కనిగిరిరూరల్: ఉద్యానవన శాఖలోని రాయితీలను పండ్ల తోటల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి విష్ణు ప్రియ అన్నారు. మండలంలోని తుమ్మగుంటలో జామ తోటలను శనివారం ఆమె పరిశీలించారు. పండ్లు, కూరగాయలు, పూల తోటలకు 40 శాతం రాయితీని ప్రభుత్వం అందజేస్తున్నట్లు చెప్పారు. పండ్ల నిల్వలకు కోల్డ్ రూమ్, రిఫైనింగ్ ఛాంబర్స్ రాయితీపై ఇస్తామని పేర్కొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా సాంబశివరావు

సీఎస్‌పురం(పామూరు): యూటీఎఫ్ అడహక్ జిల్లా కార్యదర్శిగా మండలంలోని శీలంవారిపల్లె హైస్కూల్‌ప్లస్‌లో పీజీటీ కెమిస్ట్రీగా పనిచేస్తున్న వి.సాంబశివరావు నియమితులయ్యారు. శనివారం జరిగిన యూటీఎఫ్ డివిజనల్ సమావేశంలో అయన్ను ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు